మండల అభివృద్ధి అందరి బాధ్యత

ఎంపీపీ కందుల జాను


మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

దాచేపల్లి : మండల అభివృద్ధి అందరి బాధ్యతని ఎంపీపీ కందుల జాను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రభుత్వ నిధులతో పాటుగా మండల, గ్రామ పంచాయతీ నిధుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరగాలని అధికారులకు తెలిపారు. చేపట్టిన వాటిని సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బందికి ఎంపీపీ పలు సూచనలు చేశారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలపై ప్రజల్ని అప్రమత్తం చేయాలని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల వారీగా చేపట్టిన పనుల పురోగతిపై సమావేశంలో చర్చించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్డీ జోషిబాబు, వైద్యాధికారి మధుసూదనరావు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న రాజేష్‌కు అభినందనలు



మాచర్ల రూరల్: న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు వై. రాజేష్ మ్యానెట్ డేటా ట్రాన్స్‌మిషన్ గ్రూప్ కీని తయారుచేసి ప్రతిష్టాత్మకమైన చెన్నైలోని వెల్‌టెక్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం ఆయన్ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ జి. జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకుడిగా మంచి పేరు తెచ్చుకుంటున్న రాజేష్ పరిశోధనా రంగంలోనూ ప్రతిభ చాటి పీహెచ్‌డీ డాక్టరేట్ అందుకోవడం ఆనందకరమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ ఎం. నరేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగడం అదృష్టం



మాచర్ల రూరల్: ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగడం ఎంతో అదృష్టమని ఎంఈఓ అల్లి సురేష్ అన్నారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం జరిగిన టీచ్ టూల్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరంతర విద్యార్థి ఉపాధ్యాయుడేనని తెలిపారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా విద్యనందించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న ఈ శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామారావు, కోటేశ్వరమ్మ, శ్రీనివాసరావు, శౌర్రెడ్డి నాసరయ్య, గురవయ్య పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధ విజయం అద్వితీయం



పిడుగురాళ్ల: కార్గిల్ యుద్ధ విజయం అద్వితీయమని, భారత సైనికులు వీర పోరాటానికి నిదర్శనమని బీజేపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతబోయిన హనుమంతరావు అన్నారు. పట్టణంలో కార్గిల్ విజయ్ దినోత్సవ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ భారత సైన్యం తమ త్యాగాలతో జమ్ము కశ్మీర్‌ను శత్రుదేశం పాకిస్థాన్ నుంచి కాపాడిందని కొనియాడారు. భారత సైన్య వీరోచిత పోరాటం మరువలేనిదన్నారు. అనంతరం మాజీ సైనికోద్యోగి చింతల శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో కేఎస్ఆర్ విద్యాసంస్థల అధినేతలు కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్‌రావు, డీఆర్‌డీఎస్ సంస్థ ప్రతినిధి గరికపాటి శంకరరావు, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకయ్య, రామాంజినేయులు, నరసింహారావు, ఆంజినేయులు, రాముడు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వట్టిచెరుకూరు మండలానికి చెందని బి.తిరుపాలు వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళుతున్న క్రమంలో యడ్లపాడు గ్రామంలోని సినిమాహాల్ సెంటర్ వద్ద అదుపుతప్పింది. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది తిరుపాలును చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు పాసులకు ఆర్థిక సాయం

మాచర్ల: నియోజక వర్గంలోని దివ్యాంగులు, పేద విద్యార్థులు 150 మందికి ఉచిత బస్సు పాసుల నిమిత్తం మీనాక్షి కంటి ఆసుపత్రి చైర్మన్, కార్యదర్శి, డైరెక్టర్‌ల ఆధ్వర్యంలో పి.ఎస్.ఆర్ ఆంజనేయులు రూ. 15వేల విరాళాన్ని శనివారం ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్. పిచ్చయ్య, సూపర్‌వైజర్ నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఏటా తమ సంస్థ తరఫున పలు సేవా కార్యక్రమాలకు వేలాది రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి మురహరిరావు, డైరెక్టర్లు చెరుకూరి నరసింహారావు, కర్నాటి వాసు, శేరెడ్డి గోపిరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎంఈవో కాంతారావుకి సన్మానం



దాచేపల్లి : ఎంఈవో–1గా బాధ్యతలు చేపట్టిన కె. కాంతారావుని యూటీఎఫ్ నాయకులు శనివారం కార్యాలయంలో సన్మానించారు. సంఘ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు శాలువా, పూలదండలతో అభినందించారు. ఉపాధ్యాయులు సమర్థంగా పనిచేసి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా పని చేయాలని ఎంఈవో కాంతారావు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు రాజారావు, ప్రధాన కార్యదర్శి తగరం ఆనంద్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు నాగెండ్ల ఏసయ్య, కోశాధికారి జి. శ్రీనివాసారవు, సభ్యులు రవి, కొండలు పాల్గొన్నారు.

రాజానగరం సర్పంచ్‌గా జక్కా రమేష్



దుర్గి: మండలంలోని రాజానగరం గ్రామ సర్పంచ్‌గా శనివారం జక్కా రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆశీస్సులతో తిరిగి బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ షేక్ మునీర్, మౌలాలి, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మాచర్ల రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని హెచ్‌ఎం ఐ.వి. నాగమణి సూచించారు. మండలంలోని కొప్పునూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటి పర్యవేక్షించే బాధ్యతను విద్యార్థులకు అప్పగించి వారికి దత్తత ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్‌రాజ్, అప్పారావు, మధుబాబు, రామ్మోహన్, నారాయణ, ప్రసాదరావు, పెద ఏసోబు, నారాయణ పాల్గొన్నారు.

సచివాలయం కార్యదర్శిపై విచారణ


సాతులూరులో విచారణ నిర్వహిస్తున్న ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్

నాదెండ్ల: సాతులూరు సచివాలయం–2 కార్యదర్శి రమేష్‌బాబుపై స్థానిక టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలపై ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ శనివారం విచారణ చేపట్టారు. రమేష్ బాబు గత కొన్నేళ్లుగా సచివాలయం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. పింఛన్ల మంజూరుకు లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేశారని, రోడ్డు కాంట్రాక్టర్ నుంచి కమీషన్ దండుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రమేష్‌బాబు సెలవు పెట్టారు. అయితే టీడీపీ నాయకుల ఆరోపణల నేపథ్యంలో శనివారం అతడ్ని పిలిపించి ఎంపీడీఓ జాకీర్‌హుస్సేన్ విచారణ నిర్వహించారు. తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, పింఛన్ల మంజూరుకు తాను ఎవరి దగ్గరా డబ్బులు తీసుకోలేదని ఎంపీడీఓకు వివరించారు. వివరాలు నమోదు చేసుకున్న ఆయన ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఘన నివాళి



మాచర్ల: మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం 93వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గ్రంథాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి కలాం సేవా సమితి అధ్యక్షులు షేక్ పాషావలి ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ గోపాల్ మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగి రాష్ట్రపతి అయిన కలాం అందరికీ ఆదర్శనీయుడని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు పఠాన్ బాబూఖాన్, మండల అధ్యక్షుడు వీరాస్వామి, లయన్స్ క్లబ్ సభ్యులు అల్లం కోటిరెడ్డి, చెన్నకేశవరావు, చాకలి ఐలమ్మ సేవా సమితి అధ్యక్షుడర మన్నెం పాండురంగారావు, వికలాంగుల సంఘం నాయకులు అంజి శంకర్, అన్వర్ బాషా పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో..

పట్టణంలోని రైల్వే గేటు ప్రాంతంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం షేక్ సకీనా ఆధ్వర్యంలో అబ్దుల్ కలాంకు ఘన నివాళులర్పించారు. పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో కార్యక్రమాల్ని నిర్వహించారు. దేశానికి కలాం అందించిన సేవల్ని కొనియాడారు.

గ్రామాల్లో కొనసాగుతున్న ఇంటింటి సర్వే



రెంటచింతల: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధిగ్రస్తుల్ని గుర్తించేందుకు చేపట్టిన ఇంటింటి సర్వే ఆగష్టు 2వ తేదీ వరకు కొనసాగుతుందని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 11 గ్రామాల్లో 42 బృందాలు సర్వే చేస్తున్నాయని తెలిపారు. శనివారం 691 ఇళ్లలో 2,595 మందిని పరీక్షించి 12 మంది కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, వారికి రెంటచింతల పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందుల్ని కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సేవలు పొందవచ్చని సూచించారు. ఆరోగ్య కార్యకర్త వద్ద నుంచి యండీటీ మందులు ఉచితంగా పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఏడీ శర్మ, హెల్త్‌సూపర్ వైజర్లు కె. కోటేశ్వరరావు, లక్ష్మీప్రసన్న, నిర్మల, ఎంపీహెచ్‌ఏ మహేష్‌బాబు, సీతారామిరెడ్డి, ఖాసిం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నకి'లీలలు'పై చర్యలు తీసుకోవాలి



మాచర్ల రూరల్: చెంచుల పేరుతో నకిలీ షెడ్యూలు తెగల సర్టిఫికెట్లు పొంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ నాయకులు పి. అబ్రహం లింకన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ముందు శనివారం ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అబ్రహం లింకన్ మాట్లాడుతూ నకిలీ సర్టిఫికెట్లతో కొందరు ఉపాధ్యాయ, పోలీసు ఉద్యోగాలు చేస్తున్నారని ఆరోపించారు. న్యాయ విచారణ జరిపి వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాచర్ల దానియేలు, మాచర్ల రూబెన్, సీపీఐ నాయకులు మిద్దెపోగు బాబూరావు, బీఎస్పీ నాయకులు సైదులు, మండ్లి కొండలు, ఉడతల గంగయ్య, నాగన్న, శివ, యల్లయ్య పాల్గొన్నారు.